తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## తిరుపతిలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చన్నాయుడు



తిరుపతి, జూన్ 29ప్రభాతవార్త: తిరుపతి పర్యటనలో భాగంగా గురువారం సాయంత్రం ఇక్కడకు వచ్చిన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చన్నాయుడును తిరుపతి ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ మర్యాదపూర్వకంగాకలిశారు. హోటల్ గ్రాండ్‌రిడ్జిలో దిగిన అచ్చన్నాయుడును సుగుణమ్మతో బాటు పార్టీ నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్ ఉన్నారు. మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా తిరుపతిలో పార్టీ పరిస్థితులు, నాయకులు, కార్యకర్తలు కలసి పనిచేసే తీరును అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలవాలనే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

## చతుర్వేద హవనంలో వేదమంత్రాలతో మార్మోగిన తిరుపతి



తిరుమల, జూన్ 29ప్రభాతవార్తప్రతినిధి: లోకకల్యాణం కోసం తిరుపతి టిటిడి పరిపాలన భవనం మైదానంలో గురువారం ఉదయం ప్రారంభమైన శ్రీనివాస చతుర్వేద హవనంతో తిరుపతి వేదమంత్రాలతో ప్రతిధ్వనించింది. వారంరోజులపాటు ఈ చతుర్వేద హవనం 32మంది రుత్వికులు,వేదపండితులు శాస్త్రోక్తంగా చేపట్టారు. రుత్వికులు కలశస్థాపన,కలశ ఆవాహన తదితర వైదిక కార్యక్రమాలతోబాటు యజమాని సంకల్పం, భక్తసంకల్పం, గణపతి పూజ,అగ్నిప్రతిష్ట కార్యక్రమాలు చేపట్టారు.

# జనసంద్రంగా సాగుతున్న యువగళం యాత్ర





చిల్లకూరు, జూన్ 29,ప్రభాతవార్త

తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ చేపడుతున్న యువగళం యాత్ర 41వ రోజు గురువారం వేళపాల్యెం గ్రామం నుండి ప్రారంభమైయింది. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని లోకేష్‌కు కర్పూర హారతులు, పూల మాలలతో స్వాగతం పలికారు. ఈ యాత్ర వేళపాల్యెం నుంచి బల్లవోలు, చింతవరం, ఏరూరు, మోమిడి గ్రామ సివారులో క్యాంపు సెట్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఫ్లక్సీలు, జెండాలు, పచ్చతోరణాలతో నిండిపోయింది. బాణసంచా కాలుస్తూ తప్పట్లు, బ్యాండ్ మేళాలు నడుమ యువగళం యాత్ర సాగింది. ఈ యాత్రలో నారా లోకేష్ వెళుతున్నంత సేపు ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 2024లో తెలుగు దేశం పార్టీ అధికారంలోకి రాగానే యువగళం యాత్రంలో తెలుసుకున్న ప్రతి సమస్యను తప్పనిసరిగా పరిష్కరిస్తామన్నారు. గూడూరు తెలుగు దేశం పార్టీ ఇన్చార్జి, మాజీ శాసన సభ్యులు పాశం సునీల్ కుమార్, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కొండే పాటి గంగా ప్రసాద్, నానాజీలు సహకారంతో యాత్ర నిర్వహించారు. ముందుగా వేళపాలెం క్యాంపు సెట్‌లో ఇంజినీరింగ్, బీటెక్, డిప్లామా చదివిన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. గత తెలుగు దేశం పార్టీ హయాంలో విద్యార్థులకు అనేక రకమైన సదుపాయాలు చంద్రబాబు నాయుడు కల్పించడం జరిగిందన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో గంజాయి పంటకు మాత్రమే మద్దతు ధర కల్పిస్తున్నారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. యువత గంజాయి మత్తుకు అలవాటు పడి జీవితాలు నాశనమైన పరిస్థితి నెలకొందన్నారు. పాదయాత్రలు చేస్తున్న సమయంలో అక్రమంగా తరలించిన సిలికా గుంటలను పరిశీలించడం జరిగిందన్నారు. విద్యార్థులకు ఎల్‌కెజి నుంచి పిజి వరకు తెలుగు దేశం ప్రభుత్వం వస్తే ఉచిత విద్య అందిస్తామన్నారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు బస్సులో ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని, 77వ జీవోను రద్దు చేస్తామన్నారు. గూడూరుని నెల్లూరు జిల్లాలో కలుపుతామన్నారు. విద్యార్థులకు మేనమామ అని చెప్పి జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు కమున మామగా మారిపోయాడన్నారు. విదేశి విద్యను తీసుకువస్తామన్నారు. చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు నిరుద్యోగులకు 8 లక్షలు ఉద్యోగాలు తీసుకువస్తే జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఉద్యోగాలు సూన్యమన్నారు. మన ప్రభుత్వం వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఈ యాత్ర కొనసాగేంత సేపు ప్రతి మహిళను, ప్రతి ఒక్కరిని ఆప్యాయతగా పలకరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య, సన్నారెడ్డి వెంకటరమణారెడ్డి, డివిజన్‌లో వున్న మండల పార్టీ అధ్యక్షులు కనపర్తి కిషోర్ నాయుడు, సర్వోత్తమ రెడ్డి, ఉచ్చూరు వెంకటేశ్వర రెడ్డి, పులిమి శ్రీనివాసులుతో పాటు తెలుగు దేశం పార్టీ నాయకులు గుండాల లీలావతి, మట్టం శ్రావణి, దాసరి శైలజ, మేకల కుమార్, సరుపూరు నాగేశ్వర నాయుడు, అన్నం మునిశేఖర్, యదనపర్తి భాస్కర్ రెడ్డి, మూగా శంకరయ్య, పూడుపర్తి ప్రవీణ్ రెడ్డితో పాటు డివిజన్‌లో వున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### సిఎం పర్యటన విజయవంతంకు

# పక్కా ఏర్పాట్లు

### డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమావేశమైన డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త: చిత్తూరు నియోజకవర్గంలో జులై 4న జరుగనున్న సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటనను సమన్వయంతో పక్కాగా విజయవంతం చేయడానికి చర్యలు చేపట్టాలని డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు పేర్కొన్నారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు గురువారం కలెక్టరేట్‌లో ఎంపీ మిధున్‌రెడ్డి, సిఎం పర్యటన సలహాదారు తలశీల రఘురామ్, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబులతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలు మాట్లాడుతూ ఉన్నత అధికారులు, జిల్లా అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి సిఎం పర్యటనను పక్కాగా విజయవంతం చేయడానికి చర్యలు చేపట్టాలన్నారు. సిఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పక్కాగా విధులు నిర్వర్తించి పూర్తి చేయాలన్నారు. సిఎం పర్యటనకు సంబంధించి కలెక్టర్ సగిలి షన్మోహన్ జిల్లా అధికారులకు విధులు కేటాయించడం జరుగుతుందని, జిల్లా యంత్రాంగానికి మంచి పేరు వచ్చేలా విధులు నిర్వర్తించి అధికారులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, మేయర్ అముద, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య, రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, డ్వామా పిడి గంగా భవానీ, ఆర్‌అండ్‌బి ఎస్ఇ ఉమామహేశ్వర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, డిఇఓ విజయేంద్రరావు, సమగ్ర శిక్షా ఎపిసి వెంకటరమణారెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం జితేంత్రనాథ్‌రెడ్డి, డిటిసి నిరంజన్‌రెడ్డి, ఇన్‌ఛార్జీ డిఎంహెచ్ఓ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డిపిఓ లక్ష్మీ, సిపిఓ ఉమాదేవి, మెప్మా పిడి రాధమ్మ, చిత్తూరు ఆర్డీఓ డాక్టర్ రేణుక, కుప్పం ఆర్డీఓ శివయ్య, మున్సిపల్ కమీషన్ డాక్టర్ జె.అరుణ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 13న చంద్రయాన్ ప్రయోగం



చంద్రునిపై దిగి పరిశోధనలు చేసే ల్యాండర్ రోవర్

శ్రీహరికోట (తడ), జూన్ 29 ప్రభాతవార్త భారత అంతరిక్ష పరిశోధన చరిత్రలో కీలకమైన చంద్రయాన్-3 ప్రయోగం జూలై 13న జరగనుంది. ఇంతకుముందు ఈ ప్రయోగాన్ని జూలై 12న జరపడానికి తలపెట్టారు. అయితే జూలై 12 నుంచి 19వ తేదీ వరకు ఇస్రో ఏ క్షణాన అయినా చంద్రయాన్-3ని ప్రయోగించడానికి అనుమతి తీసుకొని ఉన్నందున ఖచ్చితమైన సమయాన్ని ఇంకా నిర్ధారించలేదు. గురువారం చంద్రయాన్-3 ప్రయోగాన్ని ఒక్కరోజు ఆలస్యంగా జరుపుతున్నట్లు షార్ వర్గాల ద్వారా తెలిసింది. ఇప్పటికే చంద్రయాన్-3 ఉపగ్రహాన్ని మోసుకెళ్లే ఎల్‌వీఎం3 రాకెట్ ప్రయోగానికి సిద్ధంగా ఉంది. చంద్రయాన్-3లోని ల్యాండర్, రోవర్‌ల తుది పరీక్షలు జరిపి రాకెట్ చివరి భాగంలోని హీట్ షీల్డ్ మధ్య ఉపగ్రహాన్ని భద్రంగా అమర్చిపెట్టారు. ఈ నెల శాటిలైట్‌తో కూడిన రాకెట్ ప్రయోగ కేంద్రానికి తరలివచ్చే అవకాశం ఉంది. శ్రీహరికోటతో పాటు దేశంలోని ఇతర ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు, సీనియర్ శాస్త్రవేత్తలు ఈ ప్రయోగ ఘట్టాలను వీక్షించడానికి ఒక్కొక్కరుగా షార్‌కు తరలివస్తున్నారు.

## క్వారీగుంతలో ఈతకు దిగి వ్యక్తి మృతి



సయ్యద్‌బాషా మృతదేహం

పెద్దపంజాణి జూన్29 ప్రభాతవార్త : సరదాగా ఈత కొట్టేందుకుగాను క్వారీ గుంతలో దిగిన యువకుడు గల్లంతు కాగా అతని మృతదేహాన్ని వెలికి తీసిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది.ఈ సంఘటనకు సంబందించి స్థానికులు,కుటుంబీకుల కథనంమేరకు వివరాలిలా..పుంగనూరు నానాసాహెబ్ పేటకు చెందిన కరీముల్లా కుమారుడు సయ్యద్‌బాషా(35) స్థానిక టమోటా మార్కెట్‌లో కూలీపనులకు వెళ్లేవాడు.బుధవారం మార్కెట్‌లో పని ముగించుకుని తన స్నేహితులతో కలసి పెద్దపంజాణి మండలం పెద్దవెలగటూరు సమీపంలోని క్వారీవద్దకు చేరుకున్నారు.అక్కడ మిత్రులందరూకలసి భోజనంచేసిన అనంతరం ఈతకొట్టేందుకు ఉత్సాహం చూపారు.ఈ నేపథ్యంలో సయ్యద్‌బాషా సమీంలోని క్వారీగుంతలో ఉన్న నీటిలో ఈతకోసం దిగాడు.ఎంతసేపటికి అతను పైకిరాకపోవడంతో అతని స్నేహితులు కుటుంబీకులు స్థానికులకు సమాచారం అందించారు.సమాచారం తెలుసుకున్న స్థానికులు,గజ ఈతగాళ్ళు బుదవారం నుంచే సయ్యద్‌బాషా ఆచూకి కనుగొనేందుకు క్వారీ గుంతలో నీటిలోదిగి గాలించారు.అయితే ఫలితం లేకపోయింది.దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు.పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకోగా పోలీసులు,ఫైర్ సిబ్బంది,స్థానికులు క్వారీ గుంతలో మరలా గాలించారు.అంతరం క్వారీనీటి గుంతనుంచి సయ్యద్‌బాషా మృతదేహాన్ని వెలికి తీసారు.మృతదేహాన్ని పోలీసులు పంచనామా నిమిత్తం పలమనేరు ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.మృతుడు సయ్యద్‌బాషా భార్యా సైధాని ఫిర్యాదు మేరకు ఎస్సై టి.శ్రీనివాసులు కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

## సివిల్ సప్లైలో సిఎం జగన్ వినూత్న మార్పులు తీసుకువచ్చారు

### పౌర సరఫరాల శాఖ మంత్రి వెంకట నాగేశ్వరరావు



తిరుపతి కలెక్టరేట్, జూన్ 29, ప్రభాతవార్త తిరుపతి పద్మావతి అతిధి గృహానికి పౌర సరఫరాల శాఖ మంత్రి కారిమూరి వెంకట నాగేశ్వరరావు చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశం మంత్రి మాట్లాడుతున్న గత ప్రభుత్వ హయాంలో సివిల్ సప్లై డిపార్ట్మెంట్‌లో నిధులను అడ్డదారిలో వాడారని పౌర సరఫరాల శాఖ మంత్రి తెలిపారు. సివిల్ సప్లై డిపార్టెంట్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వినూత్నమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో జూలై ఒకటవ తేది నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గం నుండి గోధుమ పిండి ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదట అన్ని పట్టణ ప్రాంతాల్లో ప్రారంభించి దశలవారీగా అన్ని చౌక దుకాణాల్లో అందించనున్నామన్నారు. ఇప్పటికే ట్రైబల్ ప్రాంతాలకే పరిమితమై ఇస్తున కంది పప్పు నేడు రాష్ట్రం అంతా ఇస్తున్నామన్నారు. చిరుధాన్యాలు ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి అనేక చర్యలు చేపట్టారు. రాష్ట్రమంతా రాగులు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని ఎంఎస్‌పి ధరలకు కొనుగోలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వానికి రైతులకు మధ్య దళారీ వ్యవస్థను తావులేకుండా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేసి వారంలో రైతులకు రావాల్సిన మొత్తాని జమ చేస్తామన్నారు. ధరల నియంత్రణకు సిఎం యాప్ ఏర్పాటుతో ధరలు పెరగకుండా మానిటర్ చేస్తున్నామన్నారు. టమోటా కిలో రూ. 50 రైతులకు అందించే చర్యలు జరుగుతుందని తెలిపారు.

# వేదపాఠశాలకు టిటిడి సంపూర్ణ సహకారం

### శ్రీకళ్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల స్నాతకోత్సవంలో టిటిడి ఇవో ధర్మారెడ్డి



తిరుపతిరూరల్, జూన్29 ప్రభాతవార్త: వేద విద్య పరిరక్షణ బాధ్యత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు తీసుకోని, తుమ్మలగుంట శ్రీకళ్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల నెలకొల్పడం అభినందనీయమని టిటిడి ఇవో ఏవి ధర్మారెడ్డి అన్నారు. గురువారం తుమ్మలగుంటలో నెలకొల్పిన శ్రీకళ్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల మొదటి స్నాతకోత్సవానికి టిటిడి ఇవో ధర్మారెడ్డి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. వేద పాఠశాలకు టిటిడి సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. టిటిడి లాంటి అతిపెద్ద ధార్మిక క్షేత్రంలో 7వేద పాఠశాలలను మాత్రమే నిర్వహిస్తోందని, వేదం చెప్పే అధ్యాపకుల కొరత బాగా ఉందన్నారు. విద్యను అభ్యసించే విద్యార్థులు కూడా తక్కువ శాతం ఉన్నారన్నారు. ఈ క్రమంలో వేద పాఠశాల నిర్వహణ చాలా కష్టతరమైనదని, వేద పాఠశాల నిర్వాహణకు ఎమ్మెల్యే చెవిరెడ్డి సంకల్పించడం అభినందనీయం అన్నారు. తన 58సంవత్సరాల కాలంలో ఇలా కష్టించి, ప్రణాళికాబద్దంగా ముందుకు సాగే వ్యక్తులను చూడలేదన్నారు. నలుగురు విద్యార్థులతో ప్రారంభమైన వేద పాఠశాల నేడు 25 ఎకరాల విస్తీర్ణంలో ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దేందుకు సంకల్పించడం శుభ పరిణామం అన్నారు. శ్రీవారి పరమభక్తుడైన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులకు ఎల్లవేళల శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. శ్రీకళ్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల వ్యవస్థాపకులు, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా 25 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద వేద పాఠశాలను నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. వేద పాఠశాల నిర్మాణ పనులు ఆగష్టు నెలలో ప్రారంభించి, 16 నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఏ గ్రామంలోనైతే భగవంతుడుకి మూడు పూటల నైవేద్యం పెడతారో, ఆ గ్రామంలో ప్రజలకు ఆహార కొరత ఉండదన్న గత టిటిడి ఈవో అజయ్ కల్లామ్ అన్నమాటలు శ్రీకళ్యాణ వేంకటేశ్వర వేద పాఠశాల నిర్మాణానికి పునాది ఏర్పడిందన్నారు. నాడు నలుగురుతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో తుమ్మలగుంట వేద పాఠశాల ప్రిన్సిపల్ బ్రహ్మాజీ శర్మ, వేదిక్ యూనివర్శిటీ రిజిస్ట్రర్ రాధేశ్యామ్, టిటిడి ప్రాజెక్టు ఆఫీసర్ విభీషణ శర్మ, వేదిక్ యూనివర్శిటీ అసిస్టెంట్ ప్రొపెసర్ ముష్టి పవన్. ఫణి మంజుల, కేంద్రీయ సంస్కృత విద్యా ఫీఠం ప్రొపెసర్ రాఘవన్, తుడా కార్యధర్శి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పార్టీ బలోపేతం చేసుకోవాలి

### శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివికి చంద్రబాబు ఆహ్వానం



శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త ఉమ్మడి చిత్తూరుజిల్లాలో తెలుగుదేశం పార్టీ బలోపేతం చేసుకోవటం ముఖ్యమని పార్టీ అధినేత నారాచంద్రబాబునాయుడు శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళూరుపేట, వెంకటగిరి నాయకులకు పిలుపు నిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాజీ శాసన సభ్యుడు ఎస్‌సివి నాయుడును పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నామని నారా చంద్రబాబు నాయుడు ఆయనకు పార్టీ కండువాను కప్పారు.ఎస్‌సివి నాయుడు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ ద్వితీయశ్రేణి నాయకులకు చంద్రబాబునాయుడు దిశ దెశ నిర్దేశం చేసారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత పార్టీ కోసం పాటు పడిన ప్రతి ఒక్కరికి గుర్తింపు ఉంటుందన్నారు.మనమందరం ఒకే దృష్టి పార్టీ అధికారంలోకి తీసుకురావటానికి సైనికుల్లా పని చేయాలని చంద్రబాబునాయుడు పిలుపు నిచ్చారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో శ్రీకాళహస్తి నియోజకవర్గ రాజకీయం నీతివంతమైన పాలన నుంచి అవినీతి కుంభకోణాలు,అరాచక, అక్రమణల పాలనగా మారిందని చంద్రబాబు శ్రీకాళహస్తి కార్యకర్తలనుద్దేశించి వివరించారు. శ్రీకాళహస్తి అధికార పార్టీ శాసనసభ్యుడు సాగిస్తున్న అరాచక పాలనకు అధికారంలోకి వచ్చాక లెక్కలు తేలుస్తానని వివరించారు. మన భూముల్నికూడా మనం రిజిస్టర్‌చేసుకోవాలంటే ఎంఎల్‌ఏ అనుమతి కావాలంటున్న రిజిస్ట్రార్‌ల కథ తాము అధికారంలోకి వచ్చిన తరువాత చూస్తామని చంద్రబాబునాయుడు తమ పార్టీ కార్యకర్తలకు వివరించారు.

# భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఆజహా ప్రార్థనలు



బక్రీద్ సందర్భంగా నమాజులు ఆచరిస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో గురువారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో బక్రీద్ సందర్భంగా ఈదుల అజ్‌హా ప్రార్థనలను ఆచరించారు. అయితే అందరి సౌకర్యార్థం, ఖుర్బానీ ఇచ్చే వారికి సదుపాయంగా మూడు చోట్ల ప్రార్థనలను ఏర్పాటు చేసారు. రాజీవ్‌నగర్‌లో ప్రార్థనలను ఉదయం 7గంటలకు జరిపారు. ఇక్కడ నమాజును హాఫీజే ఖుర్ ఆన్ ఉస్మాన్ సాహెబ్ చదివించగా ఈదులగుంటలో ముప్తి నాయిం సాహెబ్ ఆచరింపజేసారు.అయ్యలనాడు చెరువులో హాఫీజే ఖుర్ ఆన్ జసీముద్దీన్ చదివించారు. బక్రీద్ పండగ సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు హాజరై ఈద్‌ముబారక్ తెలిపారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పండగల్ని హిందూ ముస్లింలు కలసి జరుపుకోవటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో గురువారం ముస్లింల బక్రీద్ పండగ సందర్భంగా పలువురు స్నేహితులు ఈద్‌గాహ్‌ల వద్ద హాజరై శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉదయం నుంచి ఈద్‌గాహ్‌ల వద్ద ప్రార్థనల సందర్భంగా ఒకరికి కొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముసాఫా తీసుకున్నారు.

**ప్రవక్తల త్యాగాలను మరువరాదు:**

ఇస్లాం మత వ్యాప్తి కోసం, ఈమాన్ కోసం మన ప్రవక్తల త్యాగాలను విస్మరించరాదని ముప్తీనయిం సాహెబ్ వివరించారు.నాడు విగ్రహారాదనను తుదముట్టించుటకు ఇబ్రహీం ఖలీలుల్లా తీసుకున్న నిర్ణయం. అందుకు ఆతను అనుభవించిన శిక్షలను అల్లాహ్‌ను నమ్ముకొని విజయం సాధించిన తీరును వివరించారు.ఇక ఖుర్బానీని మూడు రోజుల వరకు ఇవ్వవచ్చునని తెలిపారు.శనివారం సాయంత్రం వరకు ఖుర్బానీని ఇవ్వవచ్చునని ముప్తీసాహెబ్ వివరించారు.కాగా రాజీవ్‌నగర్‌లో హాఫీజే ఖుర్ ఆన్ ఉస్మాన్, అయ్యలనాడు చెరువు ఈద్‌గాహ్‌లో జసిముద్దీన్‌లు ఈదుల్ అజహా నమాజులను చదివించారు. ఈ సందర్భంగా ఈద్‌గాహల వద్ద శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు తన సన్నిహితులతో కలసి బక్రీద్ శుభాకాంక్షలను తెలిపారు, మత పెద్దల వద్ద ఆశీర్వచనాలందుకున్నారు.ఈ సందర్బంగా పోలీసులు బందోబస్తును పర్యవేక్షించగా మున్సిపాలిటి శానిటేషన్‌ను పర్యవేక్షించారు.

## రైల్లో ప్రయాణిస్తూ గుండెపోటుతో వ్యక్తి మృతి

**కుప్పంరూరల్, జనవరి 29 ప్రభాతవార్త**



రైలులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తికి గుండెపోటు రాగా ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. ఈసంఘటనకు సంబంధించి వివరాలిలా.. తమిళనాడు రాష్ట్రం వాలాజ పట్టణంకు చెందిన పరశురాం గురువారం చెన్నై - బెంగళూరు బృందావన్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణిస్తున్నాడు. ఒక్కసారిగా అతను తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుప్పం రైల్వే స్టేషన్‌లో అతన్ని దింపాక చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడు.

## నేడు పట్టుబడిన వాహనాల వేలం

**కుప్పం, జనవరి 29 ప్రభాతవార్త**

వివిధ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వివిధ వాహనాలను శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు స్థానిక సెబ్ స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు సెబ్ సిఐ కిషోర్‌కుమార్ తెలిపారు. ఆసక్తిగల వారు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని మిగతా వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## ఉపాధి పనులు చేస్తూ కూలీ మృతి

**తవణంపల్లె, జూన్ 29 ప్రభాతవార్త:**



ఉపాధి హామీ పథకం పనులు చేస్తూ తీవ్ర అస్వస్థతకు గురై కూలీ మృతి చెందిన సంఘటన మండలంలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. సంఘటనకు సంభందించి వివరాలిలా వున్నాయి. మండలంలోని టి.పుత్తూరు గ్రామానికి చెందిన కె.ఈశ్వరి(47) అనే మహిళ గ్రామస్థులతో కలసి ఉపాధి పనులకు వెళ్ళింది. ఈమేరకు మారేడులపల్లె చెరువుకు నీరందించే పీడర్ చానల్‌లో మట్టి తీస్తుండగా తీవ్ర అస్తస్థతకు గురైంది. దీనితో ఆమెను చికిత్స నిమిత్తం వెంటనే వెంట వున్న కూలీలు తవణంపల్లె పీహెచ్‌సీకి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా వుండడంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది.

## రూ.7 కోట్లకు ఐపి

**గంగవరం,జూన్ 29 ,ప్రభాతవార్త :**

చిట్టీల వ్యాపారంతో అమాయక ప్రజలకు టోకర పెట్టి సుమారు రూ.7 కోట్లకు ఐపి పెట్టడంతో మండలంలో కలకలం రేగింది.వివరాల్లోకి వెళ్ళితే..మండలంలోని కీలపట్ల పంచాయితీ నలసానిపల్లె గ్రామానికి చెందిన జి.సుబ్రమణ్యం కుమారుడు జిఎస్ శంకరయ్య అనే వ్యక్తి గత కొంత కాలంగా తమ గ్రామంలో,పలమనేరు పట్టణం బజారు వీధిలో ఓ గదిలో అద్దెకు ఉంటూ చీటీలను నిర్వహించేవాడు.శంకరయ్య ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రతి నెల రూ.5 లక్షలు.రూ.10 లక్షలు,రూ.15 లక్షలు,రూ.20 లక్షలు చీటీలను నిర్వహించేవాడు.అతనికి గ్రామంలో,పలమనేరు పట్టణంలోను సొంత భవనాలు ఉండడంతో చాలా మంది అమాయకులు నమ్మకంతో అతని వద్ద చిట్టీలు వేశారు.నలసానిపల్లె,పలమనేరు,తమ్మిరెడ్డిపల్లె,గ్రామాల వారే కాక కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎందరో తమ కూతురు పెళ్లి కోసం కొందరు,కొడుకు చదువు కోసం కొందరు,సొంతిటి నిర్మాణం కోసం మరి కొందరు ఇలా చీటీలు వేశారు.చిట్టీల గడువు పూర్తి అయినా డబ్బులు ఇవ్వకుండా నెలలు తరబడి తిప్పుకుంటూ కాలయాపన చేశాడని,ఈ నేపథ్యంలో 20 రోజుల క్రితం చిట్టీల నిర్వాహకుడు రాత్రికి రాత్రే భార్య పిల్లలతో సహా గ్రామం నుండి ఉడాయించాడు.దీంతో బాధితులు లబోదిబోమంటు పోలీసులను ఆశ్రయించారు.కుటుంబమంత కూలీనాలీ చేసుకొని కడుపుకట్టుకొని తమ పిల్లల భవిష్యత్తు కోసం కూడబెట్టుకొని చీటీలు కట్టామని బాధితులు కన్నీళ్ల పర్యాంతమవుతున్నారు.అయితే చిట్టీల నిర్వాహకుడు శంకరయ్య రెండు నెలల క్రితమే తన ఆస్తులను బందువుల పేరుపై రాయించినట్లు తెలిసింది.గురువారం 105 మందికి రూ.6 కోట్ల 93 లక్షలు అప్పు చెల్లించాలని పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఐపి దాఖలు చేశాడు.

## అనుమతులు లేకుండి వీరరాఘువులు నాయుడు విగ్రహం తొలగించడం అన్యాయం

చిత్తూరు, జూన్ 29 ప్రభాతవార్త: ఎలాంటి అనుమతులు లేకుండా చిత్తూరు విజయ డెయిరీ ఆవరణలో వున్న ఎన్‌పి వీరరాఘవులు నాయుడు విగ్రహంను తొలగించడం అన్యాయమని జిల్లా తెలుగుదేశం ఉపాధ్యక్షులు, మాజీ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ కాజూరు బాలాజీ ధ్వజమెత్తారు. వీరరాఘవులు నాయుడు విగ్రహం తొలగింపుపై ఆయన మాట్లాడుతూ డెయిరీ స్థాపించడానికి ఆయన చేసిన సేవలను గుర్తించి రైతులు డెయిరీ ఆవరణలో ఆయన విగ్రహంను ప్రతిష్టించారని, అలాగే చిత్తూరు నగరంలో సావిత్రమ డిగ్రీ మహిళా కళాశాలకు ఆయన స్థలం ఇచ్చిన దాత అని పేర్కొన్నారు. దేశంలోనే మొట్టమొదటి సారిగా సహకార రంగంలో డెయిరీ ఏర్పాటు చేసిన వీర రాఘవులు నాయుడు విగ్రహంను ఎలాంటి అనుమతులు లేకుండా డెయిరీ ఆవరణ నుండి ఎలా తొలగిస్తారని ఆయన ప్రశ్నించారు.

## తవణంపల్లెలో భక్తి శ్రద్దలలో బక్రీద్‌పండుగ

**తవణంపల్లె, జూన్ 29 ప్రభాతవార్త:**



బక్రీద్ పండుగ పర్వదినాన్ని గురువారం మండలంలోని ముస్లిం సోదరులు సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్దలతో జరుపుకున్నారు. ఈసందర్భంగా మండలంలోని అరగొండ, తవణంపల్లె, తడకర, మత్యం, మైలవారిపల్లె, గాజులపల్లె, కృష్ణాపురం, పొన్నేదుపల్లె, తదితర గ్రామాలలోని ముస్లిం సోదరులు అరగొండ, గాజులపల్లె తదితర గ్రామాలలోని మసీదులు, ఈద్గాల వద్ద ఉదయం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈమేరకు అరగొండ పరిసర గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు అరగొండ నుండి జొన్నగురకల రోడ్డులోని ఈద్గా వరకు అల్లాహ్ అక్బర్ అంటూ ర్యాలీగా వెళ్ళి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతగురువులు ఖురాన్ ప్రభోదాలను బక్రీద్ విశిష్టతను వివరించారు.

**ఐరాలలో...**

ఐరాల, జూన్ 29 ప్రభాతవార్త: మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ పర్వదినాన్ని గురువారం భక్తిశ్రద్దలతో అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఈద్గాకు వెళ్ళి అక్కడ మత గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## చోరీకేసులో దొంగకు జైలు శిక్ష

**చౌడేపల్లె,జూన్ 29 ప్రభాతవార్త:**



ద్విచక్ర వాహనాల చోరీ కేసులో దొంగకు నాలుగునెలల జైలు శిక్ష విధించారు. చౌడేపల్లె ఎస్సై రవికుమార్ తెలిపిన మేరకు 2022 డిసెంబరు నుంచి 2023 జనవరి వరకు వరుసగా చౌడేపల్లె మండలంలో నాలుగు ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. ఈకేసులను నమోదుచేసుకుని విచారించగా చౌడేపల్లె మండలం దుర్గసముద్రంకు చెందిన రేగంటి రమేష్ ఈ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు అతన్ని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈకేసుకు సంబందించి పుంగనూరు కోర్టులో విచారణలు జరిగాయి. ఈవిచారణలో రమేష్ ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడినట్లు రుజువైంది. దీనితోన్యాయమూర్తి కార్తిక్ ముద్దాయికి నాలుగు నెలల 23 రోజుల సాధారణ జైలు శిక్ష వేశారని ఎస్సై చెప్పారు. కేసుకు ఏపీపీ గా రామకృష్ణ వ్యవహరించారు.

## కుప్పంలో పారిశుద్ధ్యంపై స్పెషల్ డ్రైవ్

**- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్**

**కుప్పం, జనవరి 29 ప్రభాతవార్త**



కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం, డ్రైనేజీలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. గురువారం కుప్పం నడిబొడ్డున ఉన్న పారు ్క దుకాణాల ప్రాంతాన్ని ఛైర్మన్ పరిశీలించారు. పారు ్క అంగళ్లను తక్కువ ధరకు దక్కించుకుని ఇతరులకు అధిక ధరలకు కొంతమంది ప్రతిపక్ష నేతలు అద్దెకు ఇవ్వడం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ దుకాణాల వద్ద ఉన్న కాలువలు సైతం ఆక్రమణకు గురయ్యాయన్నారు. ఈ కాలువలు శుభ్రం చేసి దాదాపు పాతికేళ్ల అవుతోందన్నారు. ఈ నేపథ్యంలో కాలువల్లో పూడిపోయిన దుర్గంధంను మున్సిపల్‌సిబ్బందిచే వెలికి తీయించారు. మళ్లీ పార్కు దుకాణాల ఎదుట సిమెంట్ స్లాబులు నిర్మిస్తామన్నారు. పట్టణంలో పలుచోట్ల డ్రైనేజీల శుభ్రతకు తగు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలోకౌన్సిలర్‌రాజ్‌కుమార్, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ సేవలకు ఉత్తమ అవార్డు

**కుప్పంరూరల్, జనవరి 29 ప్రభాతవార్త**




కుప్పం ప్రాంతంలో లయన్స్‌క్లబ్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్న కుప్పం లయన్స్ క్లబ్‌కు లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఉత్తమ అవార్డును అందించారు. బెంగళూరులో జరిగిన కార్యక్రమంలో కృష్ణారెడ్డి, వినుత ప్రకాష్‌లు కుప్పం లయన్స్ క్లబ్‌కు పురస్కారం అందించినట్లు అధ్యక్షుడు డా॥ మహేష్ తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సత్యేంద్రశేఖర్, పిజి సెల్వం, సెంధిల్‌కుమార్, చంద్ర తదితరులు హాజరై పురస్కారాన్ని అందుకున్నారు. లయన్స్‌క్లబ్ పురస్కారాల్లో మూడో స్థానంలో నిలిచామని వారు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## ఘనంగా బక్రీద్ పర్వదినం

**కుప్పం, జనవరి 29 ప్రభాతవార్త**





ముస్లిం సోదరులు త్యాగనిరతికి ప్రతీక అయిన బక్రీద్ పర్వదినంను కుప్పం నియోజకవర్గంలో గురువారం ఘన ంగా జరుపుకున్నారు. ఉదయం 7గంటలనుంచే ఈద్ ప్రత్యేక ప్రార్థనలను మసీదులు, ఈద్గాల వద్ద మత గురువుల అధ్వ ర్యంలో చేపట్టారు. కుప్పం పట్టణం, కొత్తపేట, మోడల్ కాలనీ, కంగుంది, మల్లానూరు, నూలుకుంట, వాన గుట్ట పల్లి, మిట్టపల్లి, గణేష్‌పురం, మహ్మద్‌పురం తదితర గ్రామా ల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈసంద ర్భంగా మత గురువులు మాట్లాడుతూ బక్రీద్ పండగ దైవం పట్ల ఉన్న విశ్వాసంకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. దేశంలో అన్ని మతాలవారుకలసిమెలసిఉండాలన్నారు. ముస్లిం సోదరులకు వైకాపా, తెదేపా నేతలు పండగ శుభాకాంక్షలు తెలిపారు.

**శాంతిపురం :** మండలంలో బక్రీద్ పండగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. రాళ్లబూదుగూరు, కెపి మిట్ట, శాంతిపురం, ఎంకెపురం, కోనేరుకుప్పం తదితర గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**రామకుప్పం :** మండలంలో బక్రీద్ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. రాజుపేట, గొరివిమాకులపల్లి, గెర్నిపల్లి, మాదనపల్లి, 89 పెద్దూరు, బళ్ల, సింగసముద్రం, కెంచనబళ్ల, బళ్ల గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు.ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## 3న మరగదాంభిగా దేవికి శాకాంబరి అలంకారం

**కాణిపాకం, జూన్ 29 ప్రభాతవార్త:**

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో జూలై 3న ఆషాడ పౌర్ణమి సందర్భంగా మరగదాంభిగా అమ్మవారికి, దుర్గాదేవి అమ్మవారికి శాకాంబరి అలంకారం నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశులు తెలిపారు. ఈసందర్భంగా శ్రీమరగదాంభిగా దేవి, దుర్గాదేవిలకు వివిధ రకాల కూరగాయలు, పండ్లుతో శాకాంబరి అలంకారంను వైభవోపేతంగా నిర్వహించి ఉదయం 6 గంటల నుండి భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం భక్తులు ఉచితంగా కూరగాయాలు సమర్పించవచ్చునని, వీటిని ముందు రోజు జూలై 2న మణికంఠేశ్వరాలయంలో సమర్పించవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**-పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు**

**తవణంపల్లె, జూన్ 29 ప్రభాతవార్త:**



నవరత్నాలు కార్యక్రమం ద్వారా అర్హులందరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్.బాబు అన్నారు. బుధవారం నల్లిశెట్టిపల్లె గ్రామ సచివాలయ పరిధిలోని నారసింహనపల్లె, తెల్లగుండ్లపల్లె, తెల్లగుండ్లపల్లె ఎస్సీ వాడ, అరుందతివాడ తదితర గ్రామాలలో ఎమ్మెల్యే బాబు అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ఆయా గ్రామాలలో ఇంటింటికి వెళ్ళి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్, ఎంఈఓ త్యాగరాజులురెడ్డి, ఉపాధి ఏపీఓ లలిత, వెలుగు ఏపీఎం రవి, ఏఓ ప్రవీణ్, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్‌రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ సిద్దపంల్లె హరిరెడ్డి, నాయకులు సరకల్లు హరిరెడ్డి, తడకర మధుకుమార్, కోదండలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

**గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు**

## అవినీతికి తావు లేకుండా ప్రజా సేవ చేస్తా

**- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి**

**వెంకటగిరి, జూన్ 29, ప్రభాతవార్త:**



అవినీతికి తావు లేకుండా ప్రజలకు సేవ చేస్తానని వైసీపీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరి పట్టణం నాలుగో వార్డు కుమ్మరకుంట కాలనీలో గురువారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది కూడా అవినీతికి తావు లేకుండా పేదలకు సంక్షేమ పథకాలు ఇవ్వాలని తెలిపారు. గతంలో మాదిరిగా తూతూ మంత్రంగా కాకుండా అన్ని గడపలు తొక్కి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నట్లు తెలిపారు. మూడు, నాలుగు వార్డులలో దాదాపు 1650 గృహాలు తిరిగినట్లు చెప్పారు. పోలేరమ్మ సాక్షిగా మేలుకొలుపు కార్యక్రమం పేరుతో పట్టణంలో తిరిగిగి సమస్యలు తెలుసుకుంటామని చెప్పారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సేవా దృక్పథంతో పని చేయాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అనేక సమస్యలను పరిష్కరించినందుకకు ఆనందంగా ఉందన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. స్థానికంగా ఉన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రోడ్లు వేయించాలని, వీధి లైట్లు కావాలని, సైడ్ కాలువలు అనేక సమస్యలను రామ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన స్థానికులకు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్లు ఎం.ఎ.నారాయణ, జానకిరామయ్య, సుబ్బారావు, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, జిల్లా సంయుక్త కార్యదర్శి హరికృష్ణ, నాయకులు కోటేశ్వరరావు, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా బక్రీద్ వేడుకలు

**బాలాయపల్లి, జూన్ 29, ప్రభాతవార్త:**



జయంపు, గొట్టికాడు, ఊట్లపల్లి మసీదులలో అత్యంత భక్తి శ్రద్ధలతో బక్రీద్ వేడుకలు, మసీదులకు విచ్చేసి ముస్లీం సోదరులు ప్రార్థనలు నిర్వహించారు. శాంతి మార్గానికి ఖురాన్ దోహదపడుతుందని, పవిత్ర అల్లా సందేశాన్ని, పవిత్ర ఖురాన్ గ్రంథంలోని పలు సూక్తులు బోధించిన జయంపు ఇమామ్‌లు ఇబ్రహీం అని అల్లా భక్షు అన్నారు. త్యాగనిరతితో పాటు మనోవాంఛ, స్వార్థం, అసూయ, రాగద్వేషాలను కూడా విడిచిపెట్టి మానవతను వెదజల్లాలన్నదే బక్రీద్ పరమార్థం అని తెలిపారు. గొట్టికాడు ఇమామ్ నాయబ్ రసూల్ ముస్లీం సోదరులు అల్లాను ప్రార్థిస్తూ పేదలను ఆదుకోవాలని కోరారు. మండలంలో ఘనంగా బక్రీదు వేడుకలు జరిగాయి.

## ఘనంగా బక్రీద్ వేడుకలు

**వెంకటగిరి, జూన్ 29, ప్రభాతవార్త:**



మండలంలో ఘనంగా బక్రీద్ వేడుకలను ముస్లీం సోదరులు గురువారం నిర్వహించారు. పట్టణంలోని జామియా మసీదు, పలు చోట్ల బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఘనంగా బక్రీద్ వేడుకలను నిర్వహించారు.

## లోకేష్‌బాబుతో తూపిలి కుటుంబం భేటీ

**కోట, జూన్ 29 ప్రభాతవార్త**

యువగళం పాదయాత్రలో భాగంగా కోటకు వచ్చిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కోటకు చెందిన తూపిలి కుటుంబ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. కోటలో నారా లోకేష్‌ను తూపిలి రాధాకృష్ణారెడ్డి, కుటుంబ సభ్యులు కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా రాధాకృష్ణారెడ్డి మాట్లాడుతూ తాను పూర్తిగా నడవగలిగిన పరిస్థితి వచ్చాక లోకేష్‌బాబు ఏ జిల్లాలో ఉన్నా ఆయనతో కలిసి పాదయాత్రలో పాల్గొంటానని తెలియజేశారు.



## జగనన్న సురక్ష సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**- గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్**

**గూడూరు, జూన్ 29 ప్రభాతవార్త**



జగనన్న సురక్ష గడప గడప సర్వే కార్యక్రమం పకడ్బందీగా చేపట్టాలని, కుటుంబాలకు అవసరమైన ధ్రువపత్రాలు అందించేలా అధికారులు చూడాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో సర్వేలో ఉన్న సచివాలయ ఉద్యోగులకు, వాలంటీర్లకు పలు సూచనలు, సలహాలిస్తున్నట్లు తెలిపారు. సురక్ష సర్వే జరిగిన 7వ రోజు కుటుంబాలకు అవసరమైన ధ్రువపత్రాలను క్యాంప్ నిర్వహించి అందించాల్సి ఉంటుందని తెలిపారు. తప్పనిసరి 11 రకాల అంశాలకు సంబంధించి ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించి వారికి అవసరమైనవి ఇప్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా మంజూరు చేస్తుందని తెలిపారు. ఎవరూ ప్రభుత్వ కార్యాలయాలకు తిరగాల్సిన అవసరం లేదని, ఈ అవకాశాన్ని గూడూరు నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి సర్టిఫికెట్లు కావాలన్నా మీ ఇంటికే వచ్చి ఆన్‌లైన్‌లో టోకెన్ జనరేట్ చేసి ప్రజలకు కావలసిన సర్టిఫికెట్లు అందజేస్తారని తెలిపారు. అలాగే 11 రకాల సేవలను ఎలాంటి సర్వీసు ఛార్జీలు లేకుండా ఉచితంగా అందిస్తారని తెలిపారు. ఈ ప్రత్యేక క్యాంప్‌ల ద్వారా జనన, మరణ, కుల, సీసీఆర్‌సీ, రేషన్‌కార్డు, డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్, ఆదాయం తదితర 11 రకాల సర్టిఫికెట్లు సర్వీస్ ఛార్జ్ లేకుండా అందిస్తారని తెలిపారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కూడిన బృందం ప్రతి ఇంటిని సందర్శిస్తుందని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సిమెంటు బెంచీలు బహూకరణ

**గూడూరు, జూన్ 29 ప్రభాతవార్త**




గూడూరు పట్టణంలోని అల్లూరి ఆదిశేషారెడ్డి స్టేడియంలో రోటరీ క్లబ్, గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో వాకర్స్ మరియు క్రీడాకారుల సౌకర్యార్థం సిమెంటు బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ ధనుంజయరెడ్డి మాట్లాడుతూ అనేకమంది వాకర్లు, క్రీడాకారులు ఈ స్టేడియంకు వస్తుంటారని తెలిపారు. వారి సౌకర్యార్థం తమ తల్లిదండ్రులు బండి కృష్ణారెడ్డి, సంపూర్ణమ్మ, రొటేరియన్ శివప్రసాద్, వారి తల్లిదండ్రులు విరుపావజ్ఝల శ్రీనివాసులు, యోగాంబల జ్ఞాపకార్థం ఈ సిమెంటు బెంచీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాకర్స్, క్రీడాకారులు అలసినప్పుడు విశ్రాంతి కోసం ఈ బెంచీలు వారికి ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు నరసప్ప, సిద్ధారెడ్డి, హరినాథ్‌రెడ్డి, శివప్రసాద్, క్రీడాకారులు, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## కోటలో ఘనంగా బక్రీద్ వేడుకలు

**కోట, జూన్ 29 ప్రభాతవార్త**



బక్రీద్ పండుగను పురస్కరించుకొని కోటలో గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ముందుగా శ్యామ సుందరపురం వద్ద ఉన్న ఈద్గాకు వచ్చి ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉందని తిరుపతి వైసీపీ పార్లమెంటు నియోజకవర్గం మైనార్టీ సెల్ నాయకులు షేక్ మొబిన్‌బాషా చెప్పారు. రంజాన్ తర్వాత అత్యంత పవిత్రంగా భావించే ఈ పండుగ త్యాగానికి నిదర్శనమని చెప్పారు. అందరికీ ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా 17వ జాతీయ గణాంక దినోత్సవం

**తిరుపతి (క్రీడా), జూన్ 29, ప్రభాతవార్త**

శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఇండియన్ సొసైటీ ఫర్ ప్రొబలిలిటీ, స్టాటిస్టిక్స్, ఎస్వీ యూనివర్సిటీ స్టాటిస్టిక్స్ పూర్వ విద్యార్థుల సహకారంతో ప్రొఫెసర్ ప్రశాంత్ చంద్ర మహోల్నోబిస్ 131వ జయంతి సందర్భంగా 17వ జాతీయ గణాంక దినోత్సవాన్ని నిర్వహించారు. స్టాటిస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఇన్చార్జి డాక్టర్ ఎం. శివ పార్వతి ఈ సందర్భంగా ప్రముఖులందరికీ స్వాగతం పలికి, కోర్సు వివరాలు, డిపార్ట్మెంట్ పని తీరు పై ప్రశంగించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ.డి. భారతి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో గణాంకాల పాత్రపై తెలిపారు.

## తడలో భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

**తడ, జూన్ 29 ప్రభాతవార్త**

తడ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బక్రీద్‌ను ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. సరిహద్దుల్లోని భీములవారిపాలెం మసీదులో పెద్దఎత్తున ప్రార్థనలు చేశారు. తడ, తడకండ్రిగతో పాటు పూడి తదితర చోట్ల కూడా బక్రీద్ వేడుకలు జరిపారు. హిందూ ముస్లింలు భాయ్‌భాయ్ అంటూ తడలో రెండు మతాల వారు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

## వివాహితపై అత్యాచారయత్నం

**తడ, జూన్ 29 ప్రభాతవార్త**

తడ మండలం కాదలూరు న్యూకాలనీలో బుధవారం రాత్రి ఓ వివాహితపై అత్యాచారయత్నం జరిగినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఒక వివాహిత భర్త లేని సమయంలో ఇంట్లో నిద్రిస్తుండగా వల్లూరు ప్రవీణ్‌కుమార్ (25) అనే యువకుడు ఆ మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. తనకు సహకరించకపోతే చంపేస్తానని బెదిరించినట్లు ఆ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## దొరవారిసత్రంలో వేడిగాలులు

**దొరవారిసత్రం, జూన్ 29 ప్రభాతవార్త**

దొరవారిసత్రంలో గురువారం సూర్యుడు భగభగమండుతూ సెగలు పుట్టించాడు. రెండురోజుల నుంచి అత్యధికంగా ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో గ్రామాల్లోని ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు. దీనికితోడు పల్లెల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. జూన్ నెలాఖరులో కూడా వడగాలులు ఉండటంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

## ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు

**వైసిపి సీనియర్ నాయకులు మొక్కపాటి ప్రసాద్ నాయుడు**

**ఓజిలి, జూన్ 29, ప్రభాతవార్త**



ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్‌మోహన్ రెడ్డి, సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకి దక్కుతుందని వైసిపి సీనియర్ నాయకులు మొక్కపాటి ప్రసాద్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా సిఎం జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలుగా పేదల కోసం శ్రమిస్తున్న చక్రవర్తి జగన్ మోహన్ రెడ్డి అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ విద్య, వైద్యం వంటివాటిని దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి అందించారని, ఆయన బాటలో తనయుడు జగన్మోహన్ రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేశారని కొనియాడారు. అసమానతలు తొలగించేందుకు కృషి చేశారని, విద్యకు పెద్దపేట వేశారని ఆయన వివరించారు. ప్రతి మహిళ స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో సిఎం జగనన్న మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని, డ్వాక్రా అక్కా చెల్లెమ్మల ఇబ్బందులు నాడు పాదయాత్రలో స్వయంగా పరిశీలించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఆర్థిక చేయూతనిచ్చేందుకు అనేక పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. . రానున్న ఎన్నికల్లో సిఎం జగన్ మోహన్ రెడ్డి రెడ్డిని, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను గెలిపించుకోవాలని ఆయన కోరారు.

## అమెరికా విశ్వవిద్యాలయంతో ఎన్‌బికెఆర్ అవగాహన ఒప్పందం

**కోట, జూన్ 29 ప్రభాతవార్త**

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో అమెరికాలో ఉన్నత విద్యకు గల అవకాశాలు అనే అంశంపై మసూచ్ స్టేట్స్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ విజయ చలివేంద్రతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐదేళ్లలో జెఎన్‌టియు బిటెక్ డిగ్రీతో పాటు అమెరికాలోని మసూచ్‌స్టేట్స్ విశ్వవిద్యాలయం నుంచి ఎంఎస్సీ డిగ్రీ పొందగలరని తెలిపారు. విద్యార్థులకు విదేశాలలో ఉన్నత విద్య అభ్యసించేందుకు తమ కళాశాల మసూచ్ స్టేట్స్ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి తెలిపారు. అనంతరం మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు బిటెక్ మూడో సంవత్సరంలోనే ఎంఎస్‌ప్రోగ్రాంకు రిజిస్టర్ చేసుకోవాలని, డిగ్రీ పూర్తయిన తర్వాత మరుసటి సంవత్సరంలోనే అమెరికాలో ఎంఎస్సీ డిగ్రీ చదవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవగాహన ఒప్పందం ద్వారా విద్యార్థులు విదేశాల్లో చదువుకు మంచి అవకాశమని చెప్పారు.

## ఎస్ఐగా బి.ప్రసాద్ బాధ్యతలు స్వీకరణ

**పాలసముద్రం, జూన్ 29 ప్రభాతవార్త:**

పాలసముద్రం ఎస్ఐగా బి.ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ బి.ప్రసాద్ మాట్లాడుతూ మండల పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు పక్కాగా చర్యలు తీసుకొంటామని దీనికి అందరు సహకారం అందించాలన్నారు. మండల పరిధిలో అసాంఘీక కార్యక్రమాలు, ఇసుక అక్రమ రవాణా, నాటుసారా, అక్రమ మద్యంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తామన్నారు. ప్రజలకు ఎదైనా సమస్య వస్తే నేరుగా ఎస్ఐను సంప్రదించాలని ఆయన కోరారు. ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సురేష్ చిత్తూరు విఆర్‌కు బదిలీపై వెళ్ళడంతో ఆయన స్థానంలో ప్రసాద్ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.



















# సప్పరంలో దర్శనమిచ్చిన ద్రౌపదీ దేవి



శ్రీకాళహస్తి, జూన్ 29 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం అర్జునుడు, శ్రీకృష్ణుడు, ద్రౌపదీ అమ్మవారు పట్టణ ప్రజలకు దర్శనమిచ్చారు. రాత్రి ఉత్సవంలో ద్రౌపదీ అమ్మవారిని కురులు విరబోసుకొని అలంకరించి ఊరేగింపు నిర్వహించారు. మహాభారత పఠనంలోని ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టాన్ని పఠించారు. ఉదయం పట్టణంలోని ఊరేగింపు నిర్వహించిన తరువాత భారత పఠనం నిర్వహించారు. ఉభయదారులు జూలుగంటి హరినాధ్‌బాబుజ్ఞానపకార్థం ఆయన కుమారుడు జూలుగంటి గోపి, గాజుల సుదర్శనం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు డాక్టర్ సాయిప్రసాద్,సంధ్యల కుటుంబసభ్యులు హాజరు కాగా కార్యక్రమాల్ని నిర్వహించారు. రాత్రి ఆలయంలో వస్త్రాపహరణ అనంతరం అమ్మవారిని పట్టణంలో ఊరేగింపుకు ఆలయ పూజారులు దయానందం, పురుషోత్తంలుపూజలు నిర్వహించారు.ఊరేగింపు మద్రాస్‌రోడ్డు, జయరామారావువీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధి, నగరి వీధుల గుండా సాగింది.ఉత్సవాలను వెంకటస్వామి, దుర్గా ప్రసాద్‌లు పర్యవేక్షిస్తున్నారు.

## ఘనంగా ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

తిరుపతిరూరల్, జూన్29 ప్రభాతవార్త:

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత, తిరుపతిరూరల్ మండలాధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గం వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు పెద్దఎత్తున తుమ్మలగుంటకు చేరుకుని మోహిత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. యువనాయకుడు భవిష్యత్‌లో ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.



# జగనన్న సురక్షపై జాగ్రత్తగా వ్యవహరించాలి

## కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, జూన్ 29, ప్రభాతవార్త

జగనన్న సురక్ష కార్యక్రమం పై జాగ్రత్తగా వ్యవహరించాలని సచివాలయ సిబ్బందికి సూచనలు చేసారు. తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తిరుపతి నగరంలోని 30, 31 సచివాలయాలను, బొమ్మగుంట పరిసరాలను గురువారం కార్పొరేటర్ సికె రేవతితో కలిసి కమిషనర్ హరిత పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రజా పథకాలు అర్హులైన వారికి ఖచ్చితంగా అందాలని, ఒక వేళ ఎవరికైన అర్హత వుండి కూడా అందకుండా వుంటె ఇంటింటికి వెళ్లి పరిశీలించి వారికి అందేలా చేయ్యడం. అదే విధంగా వారికి అవసరమైన ప్రభుత్వ సర్టిఫికేట్లు వారి వద్ద లేకపోతే ధరఖాస్తు చేయించి మంజూరు చేయించే పూర్తి బాధ్యత సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్లదేనని కమిషనర్ స్పష్టం చేసారు. వాలంటీర్లు తమ ప్రాంత పరిధిలోని ప్రతి యాభై ఇళ్లను క్షుణ్ణంగా సర్వే చేయాలని, ప్రభుత్వం కల్పించిన ఈ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఇంటి వారికి వివరించి వారికి అవసరమైన సర్టిఫికేట్స్ మంజూరుకు దగ్గరుండి ఇప్పించాలన్నారు. కార్పొరేటర్ సికె రేవతి మాట్లాడుతూ కాలువను శుభ్రం చేయించాలని, అదే విధంగా వీధి లైటు వెలగడం లేదని చెప్పడంతో, వెంటనే కమిషనర్ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వివరించి, వారికి ఏవైన సర్టిఫికేట్స్ కావాలంటే దరఖాస్తు చేసుకుంటే ఎలాంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా అందజేస్తామని తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగర పాలక డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, కార్పొరేటర్ సికె రేవతి, వార్డు నాయకులు సికె రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# లోకేష్ మాటల్ని ప్రజలెవరూ నమ్మరు

## హుందాతనంతో మాట్లాడితే మంచిది- గూడూరు ఎమ్మెల్యే వరప్రసాదరావు ఆగ్రహం

గూడూరు, జూన్ 29 ప్రభాతవార్త

మంత్రిగా పనిచేసిన నారా లోకేష్ వయస్సులో చిన్నవాడని, రాజకీయంలో అనుభవం లేని లోకేష్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, అధికారులను, ప్రజాప్రతినిధులను, ఎమ్మెల్యేలను ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం తగదని, నోరు అదుపులో పెట్టుకోవడం మంచిదంటూ గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మీద ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. గురువారం గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లోకేష్ ఏమి మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని, తిట్టాలనుకుంటూ మేము తిట్టగలమని, మాకు ఆ సంస్కృతి లేదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ ప్రతి ఒక్కటి నెరవేర్చి పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందజేశారని తెలిపారు. గూడూరు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, కోట బహిరంగ సభలో మీరు మాట్లాడిన మాటలు హాస్యాస్పదమన్నారు. మీరు గూడూరు నియోజకవర్గంలో ఎంత అభివృద్ధి జరిగిందో చూడాలని సవాల్ విసిరారు. టీడీపీ ప్రభుత్వంలో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని, అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా టీడీపీ ఉందని, ప్రజలెవరు మీ కల్లబొల్లి మాటలు నమ్మరని అన్నారు. కోట సెంటర్లోని చిన్న వీధుల్లో బహిరంగ సభ పెడితే కొద్దిమంది జనాభాకే వేలమంది వచ్చినట్లు చిత్రీకరించడం మీకు చెల్లిందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ఎవరూ లేరని, మీతో వచ్చిన కొత్త మొహాలే ఉన్నాయని, పాత వాళ్లు ఎవరో కొద్దిమంది ఉన్నారని, దీనికే మురిసిపోతే ఎలాగని ప్రశ్నించారు. యువగళం పాదయాత్ర వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు.

ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు






















